అవినీతిపరుడికి శిక్ష తప్పదు

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సీఐడీ అధికారులు శనివారం టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడును అదుపులోకి తీసుకోవడాన్ని పెందుర్తి నియోజకవర్గ ప్రజలు సమర్థిస్తున్నారు. తప్పు చేసిన వారు ఎంత హోదాలో ఉన్నా శిక్ష నుంచి తప్పించుకోలేరని అంటున్నారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టేవారు, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే వారికి ఇది గుణపాఠం కావాలంటున్నారు. చంద్రబాబు అరెస్టును రాజకీయం చేయవద్దని ప్రజలు కోరుతున్నారు. చంద్రబాబుకు మద్దతు తెలిపే వారు కూడా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిని ప్రోత్సహించినట్టు అవుతుందని ఆక్షేపిస్తున్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చిన చంద్రబాబు పీడ ఇన్నాళ్లకు వీడిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సబ్బవరం/పరవాడ

చంద్రబాబు పాపం పండింది



ఇన్నాళ్లకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాపం పండింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్టు చేయడం సమంజసమే. ఇన్నాళ్లు తనకు ఎదురు లేదని విర్రవీగిన చంద్రబాబుకు ఇది సరైన గుణపాఠం.

– పైల దేముడమ్మ, నాయుడుపాలెం

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు



నాయకులు స్కాంలలో ఇరుక్కున్నప్పుడు వారిని నిందితులుగా భావిస్తే దర్యాప్తు సంస్థలు అరెస్టు చేయడం సహజం.వారికి నోటీసులు అందించి నిబంధనల ప్రకారం అరెస్టు చేసే అధికారం దర్యాప్తు సంస్థలకు ఉంటుంది.అదే విధంగా చంద్రబాబు కూడా స్కాంలో నిందితుడిగా బావించడంతో అరెస్టు చేశారు. ప్రజాస్వామ్యంలో నాయకులను అరెస్టు చేసినప్పుడు అభిమానులు,పార్టీ శ్రేణులు నిరసనలు వ్యక్తం చేయడం సర్వసాధారణమే. తప్పు చేసినవారు ఎవరైనా శిక్ష అనుభవించడం తప్పదు.

–గొటివాడ సామ్రాట్ కుమార్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు,అమృతపురం,సబ్బవరం .

చట్టం ముందు అంతా సమానమే..



దర్యాప్తు సంస్థలు తమ నిబంధనలు మేరకు వ్యవహరించి అరెస్టులు చేస్తాయి. అయితే స్కాంలో ఇరుక్కున్న నాయకులు తమ మైలేజ్ కోసం ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదు.తమపై రాజకీయ కక్ష సాధింపులకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతున్నారని ఆరోపిస్తూ తన ఉనికిని కాపాడుకునేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పార్టీ శ్రేణులు, అభిమానులు రోడ్డెక్కి నిరసనలు,రాస్తోరోకోలు చేస్తారని అంతా ముందుగా ఊహించిందే. చట్టం ముందు అంతా సమానమే కనుక అధికారులు వారి పని వారు చేస్తారు.

–దువ్వి దుర్గాలు,రిటైర్డ్ నేవల్ ఉద్యోగి,అసకపల్లి, సబ్బవరం మండలం.

ఎన్టీఆర్ ఆత్మ శాంతిస్తుంది



చంద్రబాబు నాయుడు అరెస్టుతో మహానే ఎన్టీఆర్ ఆత్మ శాంతిస్తుంది. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ మేధావిగా బిల్డప్ ఇచ్చిన చంద్రబాబు అవినీతి బట్టబలయింది. చట్టం ముందు అందరూ సమానులే. అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబును కఠినంగా శిక్షించాలి.

– వర్రి మురళి, పరవాడ

940వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



940వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కార్మిక శక్తికి విలువనిచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 940వ రోజు, శనివారం పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉక్కు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయాలంటే ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలన్నారు. ఇన్ని రోజులు కార్మికులు పట్టు వదలకుండా పోరాటం చేయడం దేశంలో ఇదే ప్రప్రథమం అని, కార్మిక శక్తికి కేంద్రప్రభుత్వం తలవంచక తప్పదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల నిరసన

పరవాడ: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పరవాడ టీడీపీ నాయకులు ఫార్మాసిటీ కూడలిలో శనివారం నిరసన చేపట్టారు. మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఇందల కొండలరావు, పైల చినఅక్కునాయుడు తదితరులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మరోవైపు ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ పైల జగన్నాథరావులను సీఐ పి.ఈశ్వరరావు గృహ నిర్బంధం చేశారు.

వెంకటాద్రిపై విశేష పూజలు



వేంకటేశ్వరస్వామి

సింహాచలం: వెంకటాద్రిపై శనివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ఆరాధన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే జేసీఐ లక్ష్యం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న జేసీఐ విశాఖ ప్రైడ్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : నగర ప్రజలకు చక్కటి ఆరోగ్యాన్ని అందివ్వటమే లక్ష్యమని జేసీఐ విశాఖ వేలీ సంస్థ అధ్యక్షుడు అమరేష్ పేర్కొన్నారు. నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శనివారం జేసీఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు సంతాన సమస్యలతో బాధపడుతున్న మహిళలకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేసీఐ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా తొలిరోజు ఆరోగ్యపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, రెండో రోజు తాగునీరు, మూడవ రోజు రోడ్ సేఫ్టీ తదితర అంశాలపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారిని సత్కరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జేసీఐ సెక్రటరీ ఇంద్రజ, డెంటల్ డాక్టర్ విఠల్‌కుమార్, డాక్టర్ మురళీకృష్ణ, సురేష్, సింధూర తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ రక్తదాన శిబిరం

జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) విశాఖ ప్రైడ్ ఆధ్వర్యంలో శనివారం జగదాంబ జంక్షన్ సమీపాన వాల్తేర్ అప్‌రోడ్డులో గల మదర్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. జేసీఐ వీక్ జైత్ర కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు జేసీఐ విశాఖ ప్రైడ్ ప్రెసిడెంట్ కె. లక్ష్మీసురేఖ్ తెలిపారు. రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సెక్రటరీ చందు కటకం, కోశాధికారి కె. శ్రీను, సభ్యులు కె. రిషి, పి. అశోక్, వంశీ, పునీత్, ఎస్. సంతోష్, దేవుడునాయుడు, కె. లక్ష్మణరావు, వీవీ నాయుడుతో పాటు 20 మంది రక్తదాతలు, మదర్ బ్లడ్‌బ్యాంక్ అధినేత శివగుప్తా పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.4.10 లక్షల జరిమానా



దాబాగార్డెన్స్‌లో వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మి


అల్లిపురం : మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేలకు పైగా జరిమానా తప్పదని టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు. శనివారం ఒక్కరోజే టూటౌన్ పరిధిలో 36 మంది నుంచి కోర్టు రూ.4 లక్షల 10 వేలు జరిమానా విధించిందని పేర్కొన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెన్ స్కూల్, అంబేడ్కర్ జంక్షన్, అల్లిపురం జంక్షన్‌లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ వారిని శనివారం నగరంలో స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లక్ష్మి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే న్యాయస్థానాల్లో భారీ జరిమానా తప్పదని, అదే విధంగా మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు.

క్షణికావేశంతో ఊహించని నష్టం

- చిన్నచిన్న కారణాలతోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు
- సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యా నివారణ దినం

మహారాణిపేట : చదువులో వెనుకబడి పీఎంపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో ఒక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం కరకం గ్రామానికి చెందిన మీసాల రమ్య (16) విశాఖలో బోయిపాలెం ఎస్ఆర్ఐ హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. ఆమెతో పాటు మేనత్త కూతురు కూడా అదే కాలేజీలో చదువుతోంది. ఈమెతో పాటు ఇతర విద్యార్థుల కన్నా రమ్య చదువులో వెనుకబడింది. దీంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. అలాగే దొండపర్తి రామాలయం వద్ద నివసిస్తున్న దల్లి రాజేష్ ఈనెల 4న ఆత్మహత్యకు పాల్పడినట్టు నాల్గో పట్టణ పోలీసులు తెలిపారు. జీవితం మీద విరక్తి చెంది చనిపోయినట్టు పోలీసులు భావిస్తున్నారు. నగరంలో సరాసరి రెండు రోజులకు ఒక ఆత్మహత్య కేసు నమోదు అవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కమిషనరేట్ పరిధిలో చిన్నచిన్న కారణాలతో పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఎక్కువ మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కుటుంబ సమస్య గాని, విద్యాపరమైన సమస్య గాని, ఆఫీసులో సమస్య వల్ల కానీ ఇటీవల ఎక్కువ మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అలాగే మానసిక అనారోగ్యం గలవారు, మాదక ద్రవ్యాలకు బానిస అయిన వారు, లైంగిక హింసకు గురైన వారు, ఉద్రేకం, దూకుడు స్వభావం కలిగిన వారు ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు ప్రయత్నం చేసే అవకాశం ఉంది. ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది ఆత్మహత్యల ద్వారా నిండు జీవితాన్ని ముగించుకుంటున్నారని ఒక అంచనా. వీటిలో నాల్గో వంతు భారత దేశంలోనే జరుగుతున్నాయని సర్వేలు చెబుతున్నాయి.

వైద్యుడిని సంప్రదించాలి



ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన ఉన్న వారు మానసిక వైద్యుడిని కలిసేలా ప్రోత్సహించాలి. వారు బాధితుల సమస్య తెలుసుకుని వారి ప్రయత్నాన్ని నివారించగలుగుతారు. ఆత్మహత్య ఆలోచనలు పదేపదే వస్తున్నప్పుడు కౌన్సెలింగ్, మందుల ద్వారా నయం చేయడానికి వీలు ఉంది. ఆత్మహత్య లేదా దిగులు వంటి లక్షణాలను గుర్తించడం, ఆత్మహత్య కోసం లేదా చావుల కోసం పదేపదే ప్రస్తావించే వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఇలాంటి వారిని ఒంటరిగా వదలకపోవడం మంచిది.

డాక్టర్ కార్రెడ్డి వెంకట రామిరెడ్డి,సూపరింటెండెంట్, ప్రభుత్వ మానసిన వైద్యశాల,విశాఖపట్నం.

ఆనందమానందమాయె..!

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారి పక్కనున్న తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో శనివారం పూర్వ విద్యార్థుల 3వ సమ్మేళనం మిలాన్-2023 ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేవీ వాల్తేర్, మిలన్-2023 కన్వీనర్ కల్నల్ విజయ్ బలరామ్ మాట్లాడుతూ 1986 నుంచి 2023 వరకు ఈ స్కూల్‌లో విద్యనభ్యసించిన అనేక మంది పూర్వ, ప్రస్తుత విద్యార్థుల ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులంతా దేశ విదేశాల్లో ఉన్నత హోదాలు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, విజయవంతమైన వ్యక్తులుగా తయారుచేసి, మార్గనిర్దేశం చేసిన గురువులకు తామంతా రుణపడి ఉంటామని తెలుపుతూ.. కృతజ్ఞతగా వారందరినీ సత్కరించామన్నారు.

10 మంది పేద విద్యార్థులకు సాయం

ప్రస్తుత విద్యార్థుల్లో 10 మంది పేద పిల్లలు ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్నారని తెలుపగా.. అలుమ్ని సభ్యులు వీరి కోసం రూ.48 వేల చెక్కును ప్రిన్సిపాల్ కమల్‌జీత్‌కు అందజేశారు. ఈ పాఠశాల విద్యార్థులకు భవిష్యత్తులో ఏ రకమైన ఆటంకాలున్నా.. వారిని దత్తత తీసుకుని తామే చదివించేందుకు కోర్ కమిటీ తీర్మానించిందని విజయ్ బలరాం తెలిపారు.

24వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు శనివారం 24వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు.

నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా రేపు

కంచరపాలెం: ఈ నెల 11న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా-2023 నిర్వహించనున్నట్లు ప్రభుత్వ నరవ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ నరవలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఈ మేళా జరుగుతుందని తెలిపారు. ఆర్ అండ్ ఏసీ, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ ట్రేడులు పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిస్ షిప్ మేళాకు అర్హులన్నారు. 15 జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కంచరపాలెం నరవ ఐటీఐలో ఉదయం 10 గంటలకు నేరుగా బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 93987 85720 నంబర్‌లో సంప్రదించాలని విజయలక్ష్మి సూచించారు.

క్లుప్తంగా

శివాలయ మండపం నిర్మాణానికి విరాళం



ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీను

పరవాడ: మండలంలోని కలపాక శివారు స్వయంభూవరంలో శివాలయ మండప నిర్మాణానికి పలువురు భక్తులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. గాజువాకకు చెందిన కేశరపు శ్రీను, రమేష్, లక్ష్మి, కిరణ్, లారీ ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు సమకూర్చిన రూ.30,116 లను కలపాక సర్పంచ్ బొండా కనకారావుకు ఇచ్చారు. మండపం నిర్మాణానికి విరాళం అందజేసిన దాతలకు సర్పంచ్ కనకారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జి.జానకీరామ్, మోహన్‌రావు, మహేష్, రోహిత్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి కృషి



బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గోవింద్

పరవాడ: మండలంలోని రావాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా గోవింద్‌ను సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ పెందుర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధితో పాటు బీసీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్యకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడిని దర్శించుకున్న నాయకులు

పరవాడ: రావాడ శివారు బొట్టవానిపాలెంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కోన రామారావు, మాజీ ఎంపీటీసీ కావలి రాజు, నాయకులు పల్లా గోవింద్, రేక రామారావు, కె.నాని, బాబు, కె.కృష్ణ శ్రీకృష్ణుడిని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

డీజీఎం బంగార్రాజుకు ఉత్తమ ఉద్యోగి అవార్డు



బంగార్రాజును సత్కరిస్తున్న జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్, వైద్యులు

సింహాచలం: జీవీఎంసీ 98వార్డు నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజుకు ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించింది. ఈ మేరకు శనివారం జరిగిన సమావేశంలో జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, వైద్యులు టి.రవీంద్ర, నస్రిన్, శిరీష, కృష్ణ, సీత సత్కరించారు. కార్యక్రమంలోఉద్యోగులు వేణుగోపాల్, కనకరాజు పాల్గొన్నారు.

అప్పన్న గోసంరక్షణ పథకానికి రూ.2 లక్షల విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గోసంరక్షణ పథకానికి నగరంలోని మధురానగర్‌కు చెందిన ఎం.ఎస్.వి.ఎస్.బి.ఎల్. చంద్రిక అనే దాత శనివారం రూ. 2 లక్షలు అందజేశారు. కొండదిగువ పరిపాలనా కార్యాలయంలో నగదు రూపంలో ఏఈవో రమణమూర్తికి ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు బాండ్ అందజేశారు. దేవస్థానం ఏఈ హరి, గోశాల సీనియర్ అసిస్టెంట్ సూరిబాబు పాల్గొన్నారు.

జిల్లాలో 9 ఫ్యాషన్ టెక్నాలజీ సెంటర్ల పునరుద్ధరణ

- డ్వాక్రా మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలు
- డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి వెల్లడి



సబ్బవరంలో నిరుపయోగంగా ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ భవనాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీపతి

సబ్బవరం: జిల్లాలోని 9 ఫ్యాషన్ టెక్నాలజీ సెంటర్లను జగనం-కిరణ్ పేరుతో పునరుద్ధరించి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. లక్ష్మీపతి తెలిపారు. ఆయన సబ్బవరం వెలుగు కార్యాలయ సిబ్బందితో కలిసి ఇక్కడ గతంలో ఫ్యాషన్ టెక్నాలజీ కోసం ఉమ్మడి విశాఖ జిల్లా డీఆర్‌డీఏ అధికారులు నిర్మించిన రెండంతస్తుల భవనాన్ని శనివారం పరిశీలించారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఈ భవనంలో సుమారు 22 మిషన్లు నిరుపయోగంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. వాటిని మరలా ఉపయోగంలోకి తీసుకు వచ్చి మహిళలకు శిక్షణ అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అదేవిధంగా వెలుగు పథకంలో మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్న మహిళా మార్టులు లాభాల బాటలో నడుస్తున్నాయన్నారు. సబ్బవరంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తూ అత్యధిక లాభాల్లో ఉందని ఆయన అభినందించారు. ఈ మహిళా మార్ట్ లకు అనుబంధంగా మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఫ్యాషన్ టెక్నాలజీ సెంటర్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన తొమ్మిది ఫ్యాషన్ టెక్నాలజీ సెంటర్లలో మాడుగులలో ఇటీవల పునరుద్ధరించడం జరిగిందన్నారు. సబ్బవరం మండలం జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉండడంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏ కార్యక్రమం చేపట్టినా అద్భుతమైన ఫలితాలు సాధిస్తుందన్నారు. పీడీ వెంట డీపీఎంలు సంజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



అప్పన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం ,మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా జరిగింది.బేడామండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ప్రతీ పాఠశాలలో ఎకో క్లబ్



శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఉమ్మడి విశాఖ జిల్లా కో-ఆర్డినేటర్లు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు

అగనంపూడి: ప్రతీ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్ ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని నేషనల్ గ్రీన్ కోర్(ఏపీఎన్‌జీసీ) అనకాపల్లి, విశాఖ జిల్లాల కో-ఆర్డినేటర్లు శిష్టు ఖగేశ్వరరావు, బాబూరావు సూచించారు. లంకెలపాలెంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎకో ఇండియా న్యూఢిల్లీ సహకారంతో ఏపీ ఎన్‌జీసీ విశాఖలో రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించిందన్నారు. ఎన్‌జీసీ జిల్లా కో-ఆర్డినేటర్లు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లకు నిర్వహించిన వర్క్‌షాపులో పాఠశాలల స్థాయిలో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయడం, విద్యార్థులను భాగస్వాములను చేయడం తద్వారా పర్యావరణ హితం కోసం పాటుపడేలా విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. ప్రతీ విద్యార్థి ఎకో ఇండియా కార్యక్రమంలో భాగస్వామి అయ్యేలా చేయడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్, విజయనగరం జిల్లా కో-ఆర్డినేటర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

వినోద్ బాలుకు 'సురా' పురస్కారం



అతిథుల చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సోషల్ వర్కర్ వినోద్ బాలు

సీతంపేట: హేతువాది పేరిచర్ల సుబ్బరాజు(సురా) సామాజిక సేవా పురస్కారం 2023 సంవత్సరానికి సోషల్ వర్కర్ ఉడుముల వినోద్ బాలుకు ప్రదానం చేశారు. సావిత్రిభాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అధ్యక్షతన శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా పురస్కారం, రూ.25 వేల నగదును ఆయనకు అందించారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ రక్తదాన ఉద్యమకారుడు, 937 రక్తదాన శిబిరాలు నిర్వహించి, 52 వేలకు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించి వేలాది మంది ప్రాణాలు నిలిపిన వినోద్ బాలుకు సురా పురస్కారం ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. బాలు చేస్తున్న కృషికి ఇప్పటికే యూత్ సర్వీసెస్ అవార్డు, ఛత్రపతి అవార్డు, ఆపద్బాంధవుడు, యంగ్ డైనమిక్ పర్సన్, భారత రక్త బంధు పురస్కారం వంటి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు వరించాయని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ ట్రస్టీ కె.బాబూరావు, రచయితలు అనిశెట్టి రజిత, కె.ఎస్.మల్లీశ్వరి, రిటైర్డ్ ప్రొఫెసర్ పేటా బాబివర్ధన్, సరిగమ సంగీత సంస్థ ఫౌండర్ ఎస్.కోటేశ్వరరావు, ట్రస్టు ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో అవినీతి నిర్మూలన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే అధికారులు, ఉద్యోగులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డీఆర్‌ఎం కార్యాలయంలో శనివారం అవినీతి నిర్మూలన, నిఘా ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎదుర్కొన్న అవరోధాలు, పొరపాట్లను సరిచేసుకునేలా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడం వల్ల తదుపరి విధుల్లో పొరపాట్లకు ఆస్కారం ఉండదన్నారు. డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.పి.సిన్హా మాట్లాడుతూ ఉద్యోగులందరూ అవినీతి నిర్మూలనలో ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అవినీతి, లంచాలకు తావులేని విధంగా నిష్పక్షపాతంగా సేవలందించేందుకు ఇటువంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. రైల్వేలో టెండర్లు, ఆక్షన్లు, కాంట్రాక్టులు, పలు కార్యక్రమాల్లో క్రమశిక్షణ, నిజాయితీలతో పనిచేయాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగుల నుంచి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్-2 పి.జె.శర్మ, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.అవినాష్ శర్మ, డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ సౌరభ్ ప్రకాష్, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సంతోష్‌కుమార్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్(పర్సనల్) ఎ.రామారావు, ట్రాఫిక్, కమర్షియల్, పర్సనల్ బ్రాంచ్‌లకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.